నాడు అభయహస్తం.. నేడు భస్మాసుర హస్తం

- అప్పుడు డిసెంబర్ 9 అన్నడు...
- ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నడు
- రుణమాఫీపై రేవంత్ మరోసారి మోసం
- రెండోసారి మోసపోతే మనదే తప్పు
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు ప్రయోజనం
- లోక్‌సభ ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి
- పదేండ్లలో బీజేపీ ప్రజలకు ఏమీ చేయలేదు
- బీజేపీని ఎదుర్కొనే ఏకైక పార్టీ బీఆర్ఎస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అలంపూర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితరులు

వరంగల్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ గద్వాల/అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల ముందు అభయహస్తం పేరిట హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. నాలుగు నెలలుగా వాటిని నెరవేర్చకుండా భస్మాసుర హస్తం చూపెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని చెప్పారు. రైతుల రుణమాఫీ హామీని పక్కనబెట్టిన రేవంత్‌రెడ్డి.. ఏ ఊరికి పోతే అక్కడి దేవుడి మీద ప్రమాణం చేసి లోక్‌సభ ఎన్నికల్లోనూ మోసం చేస్తున్నారని చెప్పారు. ఒకసారి మోస పోతే మోసగాడి తప్పు అని, రెండుసార్లు మోసపోతే తప్పు మనదే అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు బీఆర్ఎస్‌కు వస్తేనే కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మంగళవారం వరంగల్ లోక్‌సభ పరిధిలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాల్లో కేటీఆర్ ప్రసంగించారు.

రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

'రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు తులంబంగారం అన్నాడు,ఆడపడుచులకు నెలకు రూ.2500, స్కూటీ బైక్‌లు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అన్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 150 రోజులవుతున్నది. రాష్ట్రంలో ఎవ్వరికైనా తులం బంగారం వచ్చిందా? ఆసరా పెన్షను రూ.4 వేలు పెరిగిందా? ఆటోడ్రైవర్లకు నెలకు వెయ్యి, వ్యవసాయ కూలీలకు వెయ్యి ఇచ్చాడా? అని నిలదీశారు. మోసపు మాటలతో అధికారంలోకి వచ్చాడు. మోసం చేసే వాళ్లతో అప్రమత్తంగా ఉందాం. బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలవుతాయి. నిజంగా కేసీఆర్ మళ్లీ రావాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 12 సీట్లలో గెలిపించాలి. ఇదే జరిగితే ఏడాదిలోపు కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు' అని చెప్పారు. బీజేపీని ఎదుర్కొనేది కేసీఆర్ ఒక్కరేనని కేటీఆర్ అన్నారు. కుట్ర చేసి బిడ్డను అరెస్టు చేసినా కేసీఆర్ బీజేపీపై పోరాటం ఆపడంలేదని చెప్పారు. రాష్ట్రానికి బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని వివరించారు. 'తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్న బీజేపీకి ఓట్లు వేయవద్దు. మనం రాముడికి మొక్కుదాం. తెలంగాణకు ఒక్కటీ ఇయ్యని బీజేపీని ఓట్లతో తొక్కుదాం' అని పిలుపునిచ్చారు. అన్ని అవకాశాలు ఇచ్చినా బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ విశ్వాసఘాతకులు అని కేటీఆర్ మండిపడ్డారు. 'సుధీర్‌కుమార్ కేసీఆర్ వెన్నంటి ఉన్న నాయకుడు. అందరం కష్టపడి పని చేస్తే సుధీర్‌కుమార్ గెలుపు సాధ్యమవుతుంది. వరంగల్ మొదటి నుంచి బీఆర్ఎస్ గడ్డ. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం' అని కేటీఆర్ అన్నారు. సమావేశాల్లో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

ఏకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుగా నాగర్‌కర్నూల్ సెగ్మెంట్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూస్తారో.. పూటకో అబద్ధపు మాటలు చెప్పే సీఎం రేవంత్ పార్టీని గెలిపిస్తారో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కష్టకాలంలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని, కానీ మన ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధికార పార్టీ ఆఫర్ చేసిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, ఎంపీ స్థానాలు ఆశ చూపినా కాదని బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. కేసీఆర్ 1000 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే వాటిని అద్భుతంగా తీర్చిదిద్దిన వ్యక్తి ఆర్ఎస్ అన్నారు.

ఆర్ఎస్పీని గెలిపించాలి : నిరంజన్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అలంపూర్ ప్రజలు ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆర్ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచస్థాయిలో నిలిపిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. నేను పార్లమెంట్‌కు వెళితే నడిగడ్డ ప్రజలందరూ పార్లమెంట్‌కు వెళ్లినట్టేనని అన్నారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఆర్ఎస్పీ అన్నను ఆదరించాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు దేవర మల్లప్ప, అభిలాష్‌రావు, బైకాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

లోకం పోకడ

మీ ప్రచారానికి ప్రసంగాలు సిద్ధం చేశా సార్.. ఇవి దేవుడిపై వేసే ఒట్లు, అవి కేసీఆర్‌ని తిట్టేతిట్లు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.1°c	36.8°c
రంగారెడ్డి	42.9°c	23.1°c
ఆదిలాబాద్	42.8°c	22.7°c
మెదక్	42.1°c	21.5°c
నిజామాబాద్	41.5°c	25.5°c
ఖమ్మం	41.0°c	24.0°c
మహబూబ్‌నగర్	40.1°c	29.3°c
హైదరాబాద్	40.0°c	27.0°c
వరంగల్	40.0°c	26.0°c
కరీంనగర్	39.0°c	27.0°c

నేటినుంచి కేసీఆర్ రోడ్‌షో

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల్లో పార్టీకి అత్యధిక సీట్లను గెలిపించడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, శ్రేణులకు మార్గనిర్దేశం చేయనున్నారు. స్థానికంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. తొలిరోజు ఆయన మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్‌షోలలో పాల్గొంటారు. అంతకు ముందు బుధవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి బస్సులో ఎన్నికల ప్రచారానికి బయలుదేరనున్నారు. కేసీఆర్ తొలుత నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చేరుకొని, అక్కడ రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం సూర్యాపేటకు వెళ్లి, అక్కడ కూడా రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం భువనగిరికి చేరుకొని, సాయంత్రం రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి అక్కడే బస చేస్తారు. కేసీఆర్ ప్రయాణించే బస్సును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మంగళవారం తెలంగాణభవన్‌లో బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. రోడ్‌షోలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు దాదాపు వంద మందికి పైగా వలంటీర్లు వెన్నంటి ఉంటారు. ఉద్యమ నాయకుడిగా పాదయాత్ర, సైకిల్‌యాత్ర, బస్సుయాత్రలు చేసిన కేసీఆర్ ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా బస్సుయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో బస్సుయాత్రను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం, సరియైన నీటి నిర్వహణ లేక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడం, కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో మోటర్లు కాలిపోతుండటం, ధాన్యానికి రూ.500 బోనస్ అమలు చేయకపోవడం, ఆసరా పింఛన్‌దారులకు రూ.4 వేలు ఇవ్వకపోవడం, మహిళలకు ప్రతి నెలా రూ.2,500 హామీని అమలు చేయకపోవడం తదితర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కేసీఆర్ దృష్టిసారించనున్నట్టు సమాచారం.

తెలంగాణ భవన్‌లో మంగళవారం తెలంగాణ ప్రగతి రథానికి పూజలు

ఎక్కువ స్థానాలు సాధించడంపైనే గురి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం ఎనిమిది సీట్లు గెలుస్తుందని, కొంచెం కష్టపడితే మరో మూడు స్థానాల్లో విజయం సాధిస్తుందని పలు సర్వే సంస్థలు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తే, రెండు అంకెల స్థానాలు గెలుచుకోవడం సాధ్యమేనని గుర్తించిన గులాబీ బాస్ ఆ దిశగా కార్యాచరణ రూపొందించారు. అన్ని స్థానాల్లో అభ్యర్థులను ముందే ప్రకటించి, నియోజకవర్గాలు, మండలాలవారీగా సమావేశాలు నిర్వహించడం కూడా పూర్తయ్యింది. ఒక వైపు రోడ్‌షోలకు తోడుగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని పార్టీ నేతలు భావిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు కలవరపాటు

కేసీఆర్ 17 రోజుల టూర్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీలో కలవరపాటు నెలకొన్నది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణానికి, కేసీఆర్ పర్యటన అనంతరం రాజకీయ సమీకరణల్లో స్పష్టమైన తేడా ఉంటుందని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ విడుదల చేసిన టూర్ షెడ్యూల్ ప్రకారం.. సూర్యాపేట, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లా కేంద్రాలతోపాటు రామగుండం, కొత్తగూడెం, వీణవంక ప్రాంతాల్లోనూ కేసీఆర్ బస చేయనున్నారు. కేసీఆర్ పాల్గొనే ఒక రోడ్‌షోకు, మరో రోడ్‌షోకు మధ్య దాదాపు 10 నుంచి 12 గంటల సమయం ఉంటుంది. ఉద్యమ సమయంలో తెలంగాణ అంగుళం, అంగుళం కలియతిరిగిన కేసీఆర్‌కు పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రతి పట్టణంలో కనీసం 100 నుంచి 200 మందిని పేరు పెట్టి పిలిచేంత చనువు ఉన్నదని, వారంతా ప్రభావిత వర్గాలకు ప్రతినిధులని, వారి మీద కేసీఆర్ బస్సుయాత్ర ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. 'మా ప్రాంతానికి చాలా రోజుల తరువాత సారొస్తున్నరు. మాకు చాలా సంతోషంగా ఉన్నది. సారు మేం కలిసి మా కష్టసుఖాలు చెప్పుకుంటాం' అని మహబూబాబాద్‌కు చెందిన పార్టీ కార్యకర్త పేర్కొనడం గమనార్హం. 'తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్‌కు ఆప్తమిత్రులు ఉన్నారు. వారికి రాజకీయ పార్టీలతో పని లేదు. తెలంగాణ సమాజహితమే వారికి ముఖ్యం. అటువంటివారు అనేకమంది కారణాంతరాల వల్ల కాస్త దూరంగా ఉన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తున్నారని తెలియగానే అందరిలో సంతోషం కలిగింది' అని ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగి ఒకరు పేర్కొనడం విశేషం. మరోవైపు, కేసీఆర్ తమ ప్రాంతంలోనే బసచేయడమే కాకుండా ఎక్కువ సమయం ఉండటం వల్ల తమ విజయావకాశాలపై ప్రభావం చూపిస్తుందని, దీనితో తమ గెలుపు ఖాయమైపోయినట్టేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ చేసే దిశానిర్దేశం ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేస్తుందనే ధీమా బీఆర్ఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది.

జన యాత్రికుడు బీఆర్ఎస్ అధినేత

కేసీఆర్ 17 రోజులపాటు చేపట్టనున్న బస్సుయాత్ర, రోడ్‌షోలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కేసీఆర్ తలపెట్టిన పర్యటనను బస్సుయాత్ర, రోడ్‌షో, జనయాత్ర .. పేర్లతో పిలుస్తున్నారు. 'కేసీఆర్ ఏం చేసినా సంచలనమే..' అన్నట్టుగా రెండున్నర దశాబ్దాలుగా ఆయన చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. 2003 మార్చి 27న రాష్ట్ర సాధనే ధ్యేయంగా తెలంగాణ ఆకాంక్ష హస్తినను బలంగా తాకాలన్న తలంపుతో హైదరాబాద్ నుంచి 1,000 కార్లతో ఢిల్లీకి కారు ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు మార్గమధ్యంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోని ప్రజలకు, పార్టీలకు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను తెలియపరచాలనే లక్ష్యంతో చేపట్టిన ఆ యాత్ర దేశంలో సంచలనం సృష్టించింది.

- ఫ్లోరైడ్ రక్కసితో అల్లాడుతున్న నల్లగొండ దయనీయస్థితిని ప్రపంచానికి తెలపాలన్న లక్ష్యంతో 2003లో కేసీఆర్ పాదయాత్ర చేపట్టారు. చౌటుప్పల్, నారాయణపురం, కొత్తగూడెం, వావిళ్లపల్లి, అంతంపేట, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, కనగల్ మీదుగా నల్లగొండ వరకు కేసీఆర్ పాదయాత్ర చేశారు.
- 2003 మే 20 నుంచి 25 వరకు అలంపూర్ నుంచి గద్వాల వరకు చేపట్టిన పాదయాత్రతో పాటు ఇదే సంవత్సరంలో హాలియా నుంచి నాగార్జునసాగర్ వరకు చేపట్టిన పాదయాత్ర సమయంలోనూ కేసీఆర్ పల్లెల్లోనే బసచేశారు.

తెలంగాణ జైత్రయాత్ర: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన తరువాత రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించిన తెలంగాణ జైత్రయాత్ర సభ అపూర్వ విజయం సాధించింది. ఈ సభకు మాజీ ప్రధాని దేవేగౌడ, కేంద్ర మాజీ మంత్రి అజిత్‌సింగ్ హాజరయ్యారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం వెనుక ఈ సభ కీలకమలుపుగా నిలిచింది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సభకు సిద్దిపేట నుంచి వరంగల్‌కు కేసీఆర్ సైకిల్‌యాత్ర చేశారు. అయితే, ఆ రోజు కేసీఆర్ తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, ముందే ప్రకటించిన విధంగా ఆయన సైకిల్‌యాత్రను కొనసాగించడం విశేషం.

- తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకం అయ్యేందుకు కేసీఆర్ పల్లెనిద్ర, తండానిద్ర కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణప్రగతి కార్యక్రమాల రూపకల్పనకు పల్లెనిద్ర, తండానిద్రలాంటి కార్యక్రమాలే ప్రేరణగా నిలిచాయి. తండా నిద్రలో భాగంగా 2008 ఏప్రిల్‌లో వచ్చిన ఉగాది పండుగను కూడా కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం జామతండాలనే జరుపుకున్నారు. 2001 నుంచి 2014 దాకా కేసీఆర్ హైదరాబాద్, సిద్దిపేటలోని తన నివాసాల్లో కాకుండా అనేక తెంగాణ ప్రాంతాల్లో బసచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత సైతం పలు సందర్భాల్లో అదే ఒరవడిని కొనసాగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వరంగల్, కరీంనగర్ సహా అనేక ప్రాంతాల్లో అనేక రోజులు కేసీఆర్ బస చేశారని పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు.

తెలంగాణలో భిన్న వాతావరణం

- ఓ వైపు ఎండలు, మరోవైపు వానలు
- మరో వారంపాటు అధిక ఉష్ణోగ్రతలే
- భారత వాతావరణశాఖ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 43 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. మరో వారంపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో కొన్ని రోజులుగా భిన్న వాతావరణం ఉంటున్నది. ఓ వైపు ఎండలు మండుతుండగా, మరోవైపు అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రెండ్రోజుల క్రితం పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోనూ వర్షం దంచికొట్టింది. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడే అవకాశం ఉన్నదని, గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రామగుండం ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అదే సమయంలో పగటివేళ 36 నుంచి 42 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు వేడి ఉంటుందని చెప్పారు. దక్షిణ తెలంగాణ, తూర్పు తెలంగాణలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైనే ఎండల తీవ్రత నమోదయ్యే చాన్స్ ఉన్నట్టు తెలిపారు. ఇక హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

మంగళవారం రిటర్నింగ్ అధికారి శశాంకకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికపూడి గాంధీ, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు. చిత్రంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి మంగళవారం ఇండిపెండెంట్‌గా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్‌కు అందజేస్తున్న శిరిష(బర్రెలక్క). చిత్రంలో ఆమె భర్త వెంకటేశ్, అత్త బక్కమ్మ, బావ చిట్టిబాబు

సీఎం రేవంత్‌కు ఓటమి భయం

- ప్రజలు నమ్మరనే దేవుళ్లపై ఒట్లు
- కేసీఆర్‌తోనే తెలంగాణకు రక్ష
- నల్లగొండలో బీఆర్ఎస్‌దే గెలుపు
- నేటినుంచి కేసీఆర్ బస్సు యాత్ర
- కృష్ణారెడ్డి నామినేషన్ ర్యాలీలో జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ఎన్నికల అధికారి హరిచందనకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, రవీంద్రకుమార్

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్23(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకే మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. కానీ, ఎంతమంది దేవుళ్లపై ఒట్లు వేసినా ఈసారి ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రైతుబంధు ఇచ్చేందుకు కేసీఆర్ 10 వేల కోట్లను సిద్ధం చేసిపెడితే అడ్డుకొని ఎన్నికల తర్వాత వాటిని కాంట్రాక్టర్లకు చెల్లిచి వాళ్ల నుంచి కమీషన్ల రూపంలో ఢిల్లీకి కప్పం చెల్లించారని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రేవంత్‌రెడ్డి దుర్భాషతో కాలయాపన చేస్తున్నారని, సీఎం హోదాలో ఆయన వ్యాఖ్యలను ప్రజలు ఈసడించుకుంటున్నారని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే

కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలే నిదర్శనమని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గుజరాత్‌లో మోదీపాలన తనకు ఆదర్శమన్న రేవంత్‌రెడ్డి మోదీకి రాష్ట్రంలో ప్రథమ శిష్యుడని పేర్కొన్నారు. మోదీని పల్లెత్తు మాట అనకుండా కేవలం కేసీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేస్తున్నాడని చెప్పారు. తెలంగాణ హక్కులు కాపాడుకోవాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న కేసీఆర్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ సర్కార్ మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం మిర్యాలగూడ, సూర్యాపేటలో జరిగే కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి గెలుపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నల్లగొండ జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగులు, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇస్లావత్ రాంచంద్రనాయక్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ మంత్రులు తాగి ఎక్కడున్నారు?

నల్లగొండ జిల్లాలో రైతులు, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే జిల్లా మంత్రులు తాగి ఎక్కడున్నారని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డినే రైతులు చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందని చెప్పారు. రైతులకు దక్కాల్సిన మద్దతు ధర విషయంలో మిల్లర్లతో కుమ్మక్కై మంత్రులు రైతులకు ఎగనామం పెడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు ఇవ్వాల్సిన రూ.500 బోనస్‌ను వ్యాపారులకు కట్టబెట్టడం కాంగ్రెస్ సర్కారుకే చెల్లిందని విమర్శించారు. నాగార్జునసాగర్‌లో నీళ్లున్నా ఇవ్వలేక మూడున్నర లక్షల ఎకరాల పంట చేలను ఎండబెట్టిన ఘనత జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిదేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు కష్టాలు

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు కష్టాలు తెచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ ఎంపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభ